
# మహానగరం కథలు

-వేదుల సుభద్ర





*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బుడి ముబ్బిడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్ధమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్ధికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

# పెద్ద గీత- చిన్న గీత

"లతమ్మా, త్వరగా రావాలి.. నాన్న బయలుదేరుతున్నారు కాలేజీకి. నువ్వు ఎదురు రాకుండా ఎప్పుడైనా వెళ్లారా? మా బంగారు తల్లివి కదూ. తొందరగా రా!" అమ్మ మాటలు చెవిన పడినట్టయి ఉలిక్కిపడింది లత.

చుట్టూ చూస్తే తమ ఇల్లే. ఎవరూ లేరు.. 'అదేమిటి? అమ్మ ఇప్పుడేగా కనిపించింది, నాన్న కాలేజీకి వెళుతున్నారు, ఎదురు రమ్మంది. నాన్న కూడా ఎప్పటిలాగే చిరునవ్వుతో వీధిగదిలోనే నిల్చుని ఉన్నారు కదా!! ఏరీ వాళ్ళు? ' అనుకోగానే లత కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి.

చున్నీతో కళ్ళు గబ గబా తుడుచుకుంది. అప్పుడు తెరిపిన పడి చుట్టూ చూసింది. ఎవరూ లేరు ఇంట్లో తనొక్కర్తే. కాస్త పాతదై, మరకలు పడ్డ సోఫా, దానికెదురుగా మోగుతున్న సెకండ్ హేండ్ టీ.వీ. పక్కనే చిన్న బల్ల మీద టెలిఫోన్. దాని పక్కనే కిటికీ. లేచి కర్టెన్ జరిపి కిటికీలోంచి బయటకి చూసింది. గల్ఫ్ దేశపు ఎండ తీక్షణంగానే మెరుస్తోంది.

" ఎండ ఎక్కిందర్రా, లేవరూ, ఎప్పటికి తలంట్లవుతాయీ? వంట ఎప్పుడు చెయ్యను? పూజ ఎప్పుడు చేస్తారు నాన్న? ఆనక వినాయకుడికి కోపం వస్తే ఉండ్రాళ్ళన్నీ ఆయనే తినేసి చక్కాపోతాడు. ఆపైన మీ ఇష్టం" అమ్మ అన్న ఆఖరు మాటలకి తారాజువ్వల్లా లేచేవారు తనూ, చెల్లెళ్ళూ.

"ఎండా? ఎక్కడమ్మా? అన్నీ అబద్ధాలే నువ్వు చెప్పేవి. పిసరంత వెలుగు లేదే?" ఫిర్యాదు చేసేది తను. పళ్ళూ, పూల చెట్లు అల్లిబిల్లిగా అల్లుకుని పచ్చనాకుల పందిరేసిన పెరట్లోకి వెలుగు కనపడటం లేదు కానీ టైము చూడు ఎంతయిందో అని అమ్మ చెప్పేది.

" లతా, ఇక్కడ వీలైనంత వరకూ ఎండలో బయటకి వెళ్ళకు. ఏమైనా కావాలంటే శాంతి వచ్చాకా సాయంత్రం వెళ్ళండి, లేదా నేనొచ్చాకా కలిసి వెళదాం" అంటాడు భర్త.

" అదేం? అంత ఎండా?" ఆశ్చర్యంగా అడిగింది తను వచ్చిన కొత్తలో.

" ఇక్కడ ఎండ తీక్షణంగానే ఉంటుంది. అందులోనూ ఈ వేసవి కాలంలో మరీను. వడ దెబ్బ అదీ తగిలితే ప్రమాదం ఒకటి, ఈ డాక్టర చుట్టూ తిరగడం అవీ లేని పోనీ తలనెప్పులు, ఖర్చూ" అన్నాడు భర్త నచ్చచెప్తున్నట్టుగా. మౌనంగా తల ఊపింది.

శాంతి అంటే అతని స్నేహితుడు రాంజీ భార్య. ఇద్దరూ కలిపి రెండు బెడ్ రూముల ఫ్లాట్ అద్దెకు తీసుకున్నారుట.

" ఈ గది మనది, వాళ్ళది కాస్త పెద్దది, చిన్న పిల్ల ఉంది కదా, సరిపోదని అది వాళ్ళనే ఉంచుకోమన్నాను. ఈ హాల్, కిచెన్ కామన్. మనకిష్టమైనప్పుడు వండుకోవచ్చు. కావలసిన వాళ్ళే కనక మనం కలిసే భోంచేయచ్చు, వద్దనుకుంటే మనిష్టం" అన్నాడు. ఆమెకి ఆశ్చర్యం వేసింది.

"ఇల్లే చిన్నదిగా ఉంది, ఇందులో రెండు కుటుంబాలా?" అనుకుంది.

" నాకు తెలుసు లతా, పల్లెలో మీ ఇల్లు చాలా పెద్దది, ఇండియాలో మా ఇల్లూ పెద్దదే, ఇక్కడ మనం కొన్నాళ్ళు నిలదొక్కుకునేవరకూ, నాలుగు రాళ్ళు వెనకేసుకునేవరకూ ఈమాత్రం సర్దుకుపోవడం తప్పదు. నీకు కష్టమే, కానీ ఇద్దరూ చెరొకచోటా ఉండేకంటే ఇది నయం కదూ" అంటే ఏమీ మాట్లాడలేకపోయింది.

"నిజమే, అతను తన జీవితంలోకి వచ్చి మూడు నెల్లే, కానీ అతన్ని వదిలి ఒక్క క్షణం వదిలి ఉండలేని పరిస్థితి."

" చాలా మంచి కుర్రాడు, కుటుంబం.. దుబాయి లో ఉద్యోగం. ఇంకా ఆలోచిస్తావేం అన్నయ్యా? మా వారికి దగ్గర బంధువులే. ఇది అయితే ఇంకా ఇద్దరున్నారు కదా. "అని అత్త చెప్పిన వెంటనే నాన్నకీ వాళ్ళు నచ్చడం, వెంటనే పెళ్ళి జరిగిపోవడం క్షణాల్లో జరిగినట్టు జరిగిపోయాయి.

మొదట నేను వెళ్ళి ఇల్లూ అదీ చూసుకుని వచ్చి ఆపైన లతని తీసుకుని వెళ్తాను అన్నాడు భాస్కర్. ఆ కాస్తకాలం గడిచేసరికే ఎన్నో యుగాలైనట్టు అనిపించింది లతకి. కానీ అతనితో వెళ్ళవలసి వచ్చినప్పుడు మాత్రం తన కుటుంబాన్నివదిలేసి రావాలంటే ఆమె మనసంతా దిగులుతో నిండిపోయింది. వెక్కి వెక్కి ఏడుస్తున్న తనని దగ్గరకు తీసుకుని

" ఆడపిల్లలన్నాకా ఏదో ఒకరోజు ఇది తప్పదు కదా తల్లీ" అంటూ అమ్మ అంటూ ఉండగానే

" అలా అంటావేం భవానీ, పిల్లలందరూ తమ భవిష్యత్తు కోసం ఎక్కడికో అక్కడికి వెళ్తూనే ఉన్నారుఈ రోజుల్లో, దానికి ఆడా, మగా తేడా ఏముంది? అయినా అల్లుడు చెప్పాడమ్మా, మనదేశానికీ, దుబాయికీ కేవలం నాలుగు గంటలేనట ప్రయాణం. అంటే సరిగ్గా మీ అమ్మమ్మగారి ఊరు వెళ్ళినట్టన్నమాట. ఎప్పుడు కావాలన్నా రావచ్చు, వెళ్ళచ్చు" అంటూ నాన్న ధైర్యం చెప్పారు.

కానీ అది అంత సులువు కాదని, అందరికీ అలాంటి వీలుండదని ఆమెకి ఇక్కడికి వచ్చిన కొత్తలోనే అర్థం అయింది.

" మీ నాన్నగారు చెప్పిందినిజమే! దూరం పెద్ద ఎక్కువ కాదు, అలాగే సరిగా చూసుకుని కొనుక్కుంటే టికెట్లు కూడా మంచి రేటులో దొరికే అవకాశాలు కూడా ఉన్నాయి. కానీ అస్తమానూ వెళ్తూ ఉంటే మనకి మిగిలేది ఏముంటుంది? ఆలోచించు" అన్నాడు భాస్కర్.

అతను అలా అనగానే ఆమెకి చాలా దిగులుగా అనిపించింది.

" వచ్చి మూడునెల్లవలేదు, అలా దిగులు పడితే ఎలా? అని శాంతి కూడా ఏడిపించేది. ఒకరకంగా వాళ్ళతో కలిసి ఉండడం మంచిదే అనిపించేది. భాస్కర్ ఆఫీస్ చాలా దూరం ఇంటినించి. రెండు బస్సులు మారి వెళ్ళేవాడు. తిరిగి వచ్చేసరికి కూడా ఆలస్యం అయ్యేది. శాంతి దగ్గరలో ఉన్న హాస్పటల్ లో రిసెప్షనిస్ట్ గా పనిచేస్తుంది. వాళ్ళకి ఒక కూతురు, సింధు. స్కూల్లో వేశారు. ఆరుగంటలు డ్యూటీ చేస్తుంది శాంతి. సింధు స్కూల్ నించి వచ్చే సమయానికి ఇంట్లో ఉండేలా చూసుకుంటుంది. దానికోసమే పొద్దున్న షిఫ్ట్ లో పనిచేస్తుంది, వచ్చేటప్పుడు పాపని తీసుకుని వచ్చేస్తుంది. పొద్దున్నే తయారుచేసి పంపడం రాంజీ పని.

"కరామా, బర్ దుబాయ్ ( దుబాయ్ లోని ప్రాంతాల పేర్లు) లలో అయితే చాలా మంది మనభారతీయులు ఉంటారు, మన ఏరియాలో తక్కువే అనుకో అలాగే ఇక్కడ అద్దెలు కూడా తక్కువ. అందుకే రాంజీ, భాస్కర్, నేనూ ఇక్కడ చూశాము" అంది శాంతి ఒకరోజు.

మొదట్లో శాంతి వచ్చేసమయానికి తమ వంట చేసేసుకుని, గట్టు అదీ తుడిచి శుభ్రం చేసేసేది లత. మెల్లిగా పరిచయం పెరిగాకా ' నేను ఇంట్లోనే ఉంటాను కదా, అందరికీ నేను వంట చేశేస్తాను" అంటూ చెయ్యడం మొదలుపెట్టింది.

" నీ చేతి వంట అమృతమే అనుకో, కానీ నువ్వు ఇలా అలవాటు చేస్తే నాకు బద్ధకం పెరిగిపోతుంది. సెలవురోజుల్లో నీకు రెస్ట్, నేను చేస్తాను అనేది శాంతి. పాపని పంపి వెళ్ళే రాంజీ కూడా సాయంత్రం వచ్చేసరికి ఆలస్యం అయ్యేది. అందుకని సాయంత్రం పూట ఆడవాళ్ళిద్దరికీ మాట్లాడుకోవడానికీ, కావలసిన షాపింగ్ చేసుకోవడానికి బోల్డంత టైముండేది.

" నువ్వు కూడా ఏదైనా ఉద్యోగం చూసుకోవచ్చు కదా, డిగ్రీ చదివావు. వేడినీళ్ళకి చన్నీళ్ళు. మీ చెల్లెళ్ళ పెళ్ళిళ్ళకైనా పనికొస్తాయి" అనేది శాంతి.

" దాని మాట ఎలా ఉన్నా కనీసం ఎప్పుడూ ఇంటి గురించే ఆలోచన అయినా తగ్గుతుంది" అనేవాడు భాస్కర్. వారమంతా పనిచేసి వచ్చిన వాళ్ళు ముగ్గురూ వారాంతంలో బాగా పొద్దెక్కేవరకూ పడుకునేవారు. అంతసేపు నిద్రపోవడం అలవాటు లేని ఆమెకి ఏమీ తోచేది కాదు. ఎప్పుడెప్పుడు ఇంటికి వెళ్తానా, అమ్మా నాన్నలని చూస్తానా, చెల్లెళ్ళతో ఎప్పుడు గడుపుతానా? అని ఆరాటపడేది ఆమె మనసు.

" మేము ఇండియా వెళ్ళి దాదాపు రెండేళ్ళవుతోంది. పేరుకి దగ్గరే అనుకో, కానీ ఏదో ఒకటి వస్తూనే ఉంటుంది. మా ఆడపడుచు పెళ్ళికి కావాలంటే డబ్బు సర్దాము కదా, పెళ్ళికి వెళ్ళి వచ్చాకా మళ్ళీ వెళ్ళలేదు. అన్నీ చూసుకోవాలి కదా! అంతా మనమేదో ఇక్కడ బోల్డు డబ్బు పోగేసుకుంటున్నం అనుకుంటారు. ఇండియా వెళ్ళాలంటే టిక్కట్లొక్కటే కాదు, అందరూ ఆశించే కానుకలూ, బంగారాలు.. ఇవన్నీ తలుచుకుంటేనే భయం నాకు" అంటుంది శాంతి.

అలాంటి మాటలు విన్నప్పుడు లత కి మరింత దిగులుగా అనిపించేది. అమ్మ, నాన్న మాటి మాటికీ గుర్తొచ్చేవారు.

" ఈ రోజు పల్లవి ఏదో పూజ చేసిందిట, మన ఇద్దరినీ పేరంటానికి రమ్మని చెప్పింది. ముత్తైదువుల లెక్కట. మర్చిపోకుండా రండి అంది. సాయంత్రం నేను వచ్చాకా వెళ్దాం. నువ్వు రెడీగా ఉండు" అని చెప్పింది శాంతి ఒక రోజు.

ఆమె రాగానే ఇద్దరూ సింధుని తయారుచేసి బయలుదేరారు.

" ఈ రోజు చాలా అలసటగా ఉంది . బస్ ఎక్కే ఓపిక నాకు లేదు, పోనీ టాక్సీ ఎక్కుదామా?" అంది శాంతి.

" ఎంతవుతుందో, ఏమిటో?" అంది లత కంగారుగా.

ఇక్కడికొచ్చాకా అన్నీ రూపాయిల్లోకి మార్చి చూసుకుని లెక్కలు పెట్టుకోవడం మొదలు పెట్టింది లత.

" అలా చూస్తే ఏమీ కొనలేము. లెక్కపెట్టుకోక తప్పదనుకో మన బోటివారికి" అనేది శాంతి

" దుబాయి ఎంతుందో నీకు తెలుసు కదా! తిప్పి కొడితే అరగంట పట్టదు ఆ చివరినించి ఈ చివరికి వెళ్ళడానికి. ఈ రోజు ఎందుకో నీరసంగా ఉంది నాకు. పైగా పల్లవి ఇల్లు దూరం కూడా. ఈ రోజుకి టాక్సీ ఎక్కేద్దాం. అంది శాంతి విసుగ్గా.

ఇద్దరూ టాక్సీ లో కూర్చున్నాకా లత అంది " ఆయనకి చెప్పి సగం నేనిచ్చేస్తాలే" అంటూ.. అన్నింటిలోనూ సగం సగం గా ఖర్చు పెట్టుకుంటూ ఉంటారు వాళ్ళు.

" అరే మీరా శాంతి బెహన్!" అన్నాడు డ్రైవర్ అప్పుడే ఆమెని చూసి గుర్తు పడుతూ.

" ఓ ఇందర్ భయ్యా! మీరా? బావున్నారా? ఇంకా ఇక్కడే ఉన్నారా? క్రిందటి సంవత్సరమే వెళ్ళిపోతాను అన్నారు కదా?" అంటూ అడిగింది.

లత వీళ్ళిద్దరినే చూస్తోంది.

" ఈమె నా స్నేహితురాలు లత, ఈ మధ్యనే వచ్చింది ఇండియానించి. ఇతను ఇందర్ భయ్యా, నేను ఇంతకు ముందు పనిచేసే కంపెనీలో నాతో కలిసి పనిచేసేవారు. ఎప్పుడైనా నాకు లేట్ అయితే పాపం తోడుగా వచ్చి దించేవారు." అంటూ పరిచయం చేసింది.

" అవునమ్మా, ఇంకా ఇక్కడే ఉన్నాను. వెళ్ళిపోవడం అనేది ఇప్పట్లో జరగదు లే. కనీసం వెళ్ళి రావడం కూడా జరగలేదు ఆ కంపెనీలో మానేశాను నేను కూడా. ఇప్పుడు టాక్సీ నడుపుతున్నాను" అన్నాడు క్లుప్తంగా.

" అవునా! బావుంది. వేళా, పాళా లేని ఆ కంపెనీ ఉద్యోగం కంటే ఇది మంచిదే కదా! మీ వాళ్ళందరూ ఎలా ఉన్నారు? పిల్లలు? ఇండియా వెళ్ళాలి, వెళ్ళాలి అనేవారు కదా ! అది కూడా అవలేదా? అంతా బానే ఉంది కదా?" అంటూ అడిగింది.

ఇందర్ ఏమీ మాట్లాడలేదు. మౌనంగా టాక్సీ నడుపుతూ ఉండిపోయాడు.వారిద్దరి మధ్య సంభాషణ హిందీలో జరుగుతూ ఉండడం వల్ల లతకి అర్థం అయ్యీ, అవనట్టుగా ఉంది.

" చెప్పండి భయ్యా, ఎందుకు వెళ్ళలేదు?" అంది..

నవ్వాడు ఇందర్.. "అన్నీ కుదిరితే వచ్చే సంవత్సరం వెళతాను తల్లీ!" అని మాత్రం అన్నాడు.

" అదేం? పాప పెద్దది అయిందని కబురు వచ్చింది, వెళ్ళి చూసి వస్తాను అన్నారు కదా!" అంది గుర్తు తెచ్చుకున్నట్టుగా. కరెక్టే కదా! అంది మళ్ళీ తనే.

"నీకు బాగా గుర్తుందమ్మా, నిజమే! కానీ పరిస్థితులు అనుకూలించలేదు" అన్నాడు క్లుప్తంగా.

" అదేం? ఏం జరిగింది?" అంది ఆత్రుతగా.

" పితాజీకి ఒంట్లో బాగోలేదు, ఆపరేషన్ చెయ్యవలసి వచ్చింది. దాంతో డబ్బు పంపించాను." అన్నాడు అభావంగా.

" అయ్యో! ఇప్పుడెలా ఉన్నారు? ఠీక్ అయిందా? "అంటూ అడిగింది గబ గబా.

" పేదవాళ్ళకి ఖరీదైన జబ్బులు రాకూడదు తల్లీ, ట్రీట్మెంట్ నడుస్తోంది. చూడాలి" అన్నాడు బాధగా.

"అరే! అలాగా? తగ్గిపోతుంది లెండి. ఇప్పుడు వైద్యం బాగా అభివృద్ధి చెందింది కదా, ఎలాంటి వ్యాధినైనా సులభంగానే తగ్గిస్తున్నారు వైద్యులు. ఆయనకి తగ్గిపోతే మీరు వెళ్ళి చూసి వస్తే ఇంకా సంతోషిస్తారు" అంది.

ఇందర్ మాట్లాడలేదు. లత ఆశ్చర్యంగా ఆయన్నే చూస్తోంది.

" చూద్దాం తల్లీ వాహేగురు కృప ఎలా ఉందో? అన్నాడు అతను"

కాసేపు నిశ్శబ్దం కారులో.

పిల్లలు పెద్దవాళ్ళయ్యారు తల్లీ, మొన్ననే హరీందర్ ఫోటోలు పంపింది. పాప ఆమె భుజాలు దాటేసింది. పదమూడేళ్ళు ఇప్పుడు. పెద్దవాడు బాగా పొడుగయిపోయాడు, నాకంటే ఎత్తుంటాడేమో! చిన్నవాడికి తొమ్మిది. నాలుగేళ్ళక్రితం నేను వెళ్ళినప్పుడు అందరూ ఇంతే ఉండేవారు.

ముఖ్యంగా పింకీ, నా కూతురు చిన్న పిలక జడలేసుకుని ఉండేది. ఇప్పుడెంత అందంగా ఉందో! అచ్చు వాళ్ళ అమ్మ పోలికే. " అన్నాడు నవ్వడానికి ప్రయత్నిస్తూ.

" అవును. పిల్లలు ఎంత త్వరగా పెరిగిపోతారో! నా కూతురు సింధు కూడా అప్పుడేస్కూల్ కి వెళుతోంది" అంది శాంతి.

" అరే, అప్పుడే అంత పెద్దదయిందా?" అన్నాడు ఇందర్.

అంతలో వారు దిగవలసిన చోటు రావడంతో కార్ పక్కకి ఆపాడు.

ఇద్దరూ దిగాకా " నీ దగ్గర డబ్బులేమిటి తల్లీ, ఇన్నాళ్ళకి కలిశావు, అప్పుడు ఫోన్ లేదు నా దగ్గర. ఇప్పుడుందిగా,నంబర్ రాసుకో, ఎప్పుడైనా కలుద్దాం. ఒకసారి కమ్మగా ఇంటిభోజనం పెట్టు చాలు. అన్నట్టు పులిహోర మర్చిపోకు" అన్నాడు నవ్వుతూ.

ఎంత చెప్పినా డబ్బులు తీసుకోలేదు. దాన్ని బట్టి వారిద్దరి మధ్యా మంచి అనుబంధమే ఉందని అర్థం అయింది లతకి.

దిగి పల్లవి ఇంటివైపు నడవసాగారు ఇద్దరూ.

" చాలా మంచివాడిలా ఉన్నాడు.నీకు బాగా తెలుసనుకుంటా!" అంది లత ఇందర్ గురించి మాట్లాడుతూ

" అవును, చాలా మంచివాడు. వాళ్ళది పంజాబ్ లోని ఒక పల్లెటూరు. చాలా పెద్ద కుటుంబం, చాలీ చాలని ఆదాయం. అందరూ ఏదో ఒక చిన్న పని చేసేవారుట. ఆ పళ్ళెటూళ్ళో అంతకంటే చెయ్యడానికేమీ ఉండవు అనేవాడు. మట్టి పిసుక్కుంటూ వ్యవసాయం ఎన్నాళ్ళు చేస్తాం? అనుకునేవారుట ఇతనూ, స్నేహితుడు రాజేందర్.

ఇందర్ భయ్యాకి కూడా చిన్నప్పుడే పెళ్ళి అయింది. ముగ్గురు పిల్లలు, చూపించాడు కదా. ఇంట్లో పరిస్థితులు చూస్తూ ఉంటే ఏదో చెయ్యాలని ఉండేది కానీ ఏమిటని తెలిసేది కాదు. ఒకరోజు రాజేందర్ కి తెలిసిన అతను దుబాయ్ గురించి చెప్పాడుట. ఇంకేముంది? వీసాకీ, ప్రయాణాని కావలసిన ఇతర ఏర్పాట్లకీ ఏజెంటుకి డబ్బు ఇచ్చి వచ్చారు. అప్పటినించీ కథ మామూలే! అంటూ నవ్వింది సన్నగా.

" అలా వచ్చారా? ఇప్పుడు ఓకేనా ఇంట్లో?" అంది లత ఆసక్తిగా.

" చూశావుగా, ఓకే అంటే ఓకే, కాదంటే కాదు." అంది శాంతి.

" అంటే?" అడిగింది లత.

" ఏముంది లతా? చూశావుగా? ఇండియానించి వచ్చి ఏడుసంవత్సరాలయింది. ఒక్క సారి వెళ్ళిఉంటాడు మహా అయితే ఇన్నేళ్ళల్లో. గత నాలుగేళ్ళుగా అనుకుంటూనే ఉన్నాడు కానీ కుదరడం లేదు. ఇక్కడ పది, పన్నెండు మందితో కలిసి కంపెనీవాళ్ళిచ్చిన బస లో ఉండేవాడు అప్పట్లో. వచ్చిన ప్రతీ పైసని దాచుకోవాలి, ఇంటికి పంపించాలి ఆతని ధ్యాస. దానికోసమే ఎప్పుడూ కష్టపడేవాడు. పిల్లలకి, తల్లితండ్రులకీ, భార్యకీ అన్నీ అమర్చాలనీ, వాళ్ళ చదువులకీ, పెళ్ళిళ్లకీ వీలైనంత దాచాలనీ అతని ఆశ. దాంట్లోనే ఏళ్ళు గడిచిపోతున్నాయి" అనేవాడు.

ఒక్క అతననేముంది? మనందరమూ అంతే కదా ఇంచుమించుగా. బాగా డబ్బులున్నవాళ్ళు ప్రతీ నెలా వెళుతూ వస్తూ ఉంటారు. కానీ ఇలాంటి వాళ్ళు నాలుగేళ్ళకి ఒకసారి వెళ్ళాలన్నా సరే దానికో పంచవర్ష ప్రణాళిక వేసుకుంటేనే కానీ కుదరదు. అలా కుటుంబానికీ, మనవాళ్ళకి దూరంగా ఏళ్ళతరబడి ఉండాలంటే ఎంత కష్టమో! " ఒక మంచి ఫోన్ కొనుక్కోండి, కనీసం వాళ్ళతో విడియఒ చాట్ చేస్తే వాళ్ళని చూడవచ్చు కదా అనేదాన్ని. ఆ డబ్బు వాళ్ళ బట్టలకో, చదువుకో వాడచ్చు కదమ్మా!" అనేవాడు.

శాంతి చెప్తున్న వివరాలన్నీ ఆశ్చర్యంగా వింది లత.

"అవునా? పాపం! నాకు నాలుగు నెలలకే ఇలా ఉంది! పాపం నాలుగేళ్ళంటే ఎంత బాధగా ఉంటుందో నేనర్థం చేసుకోగలను. ముఖ్యంగా పిల్లలని వదిలి ఉండాలంటే ఏ తండ్రికైనా ఎంత కష్టం, ముఖ్యంగా వాళ్ళు పెరిగే వయసులో. పెద్దవారైన తల్లి తండ్రులూ, పిల్లలూ, భార్య.. అందరికీ కష్టమే కదూ" అంది లత దిగులు పడుతున్నట్టు.

అసలే తనవారిమీద బెంగపెట్టుకున్న ఆమె ఇంకా దిగులు పడుతుందేమో! అనవసరంగా చెప్పానా? అనుకుంది శాంతి లత చెప్పిన మాటలు విని.

" నువ్వు కూడా ఉద్యోగం చూసుకుంటే, నీ జీతం నువ్వు ఇండియా వెళ్ళడానికే వాడుకోవచ్చు. ఏమంటావు? నాకు కూడా ఎప్పుడైనా ఓ టిక్కట్టు కొను" అంటూ నవ్వబోయింది వాతావరణం తేలిక చెయ్యాడానికి ప్రయత్నిస్తూ.

లత నవ్వలేదు.

" చాలా బాధగా అనిపించింది శాంతీ నువ్వు చెప్పిన ఇందర్ భయ్యా కథ వింటే. నువ్వు చెప్పింది నిజమే అందరి జీవితాలు ఒకటే. కొన్ని చిన్న గీతలు, మరికొన్ని పెద్ద గీతలు. అదృష్టవశాత్తూ మనది చిన్నగీతే కనక పరవాలేదులే. అర్థం అయింది. ఇంక బెంగ పెట్టుకోకుండా ఉండడానికి ప్రయత్నిస్తాను" అంది కొనగోట కన్ను తుడుచుకుంటూ.

COMMENTS